క్లుప్తంగా

నేడు శ్రీరామ శోభాయాత్ర

ఆత్మకూరు: అయోధ్య నగరంలో బాలరామ విగ్రహప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలో సోమవారం శ్రీరామ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఉదయం పెద్ద ఎత్తున అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు బైక్‌ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యలను పరిష్కరించండి

ఆత్మకూరు: ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ఆత్మకూరు అంగన్‌వాడీ వర్కర్స్‌ హెల్పర్స్‌ యూనియన్‌ అధ్యక్షులు మంజుల, లక్ష్మీదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి రజాక్‌, రామ్‌నాయక్‌ కోరారు. పట్టణంలోని తహసీల్దార్‌ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ చేపట్టిన దీక్షలు ఆదివారం 41 రోజు కొనసాగాయి.

పశువుల ఎరువుతో అధిక దిగుబడి



జొన్న కంకులను చూపుతున్న రైతులు

ఆత్మకూరు: రైతులు తప్పనిసరిగా పశువుల ఎరువులు ఉపయోగిస్తే అధిక దిగుబడి సాధిస్తామని ఆత్మకూరు రైతు భరోసా కేంద్రం చైర్మన్‌ బైరాపురం మహబూబ్‌బాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని సిద్ధపల్లి రస్తాలో జొన్న పంట సాగు చేసిన ముసలిమడుగు నబిసాహేబ్‌ పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశువుల ఎరువు వినియోగం వలన ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హుస్సేన్‌బాషా, అంజుమన్‌ కమిటీ అధ్యక్షులు ఇబ్రహీం, ఖలీలుల్లా, అసతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించాలి

ఆత్మకూరు: రాష్ట్రంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్న అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, బహుజన సమాజ్‌వాదీ పార్టీ నాయకులు చంద్రశేఖర్‌ కోరారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నరసింహనాయక్‌, వెంకటేశ్వరరావు, స్వామన్న, సుధాకర్‌, రజాక్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఆదివారం జవహర్‌ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ వెంకటనరసయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు వృత్తి విద్య ద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో 28 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇందులో 12 మందిని వివిధ రంగాల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, జెకేసీ కో ఆర్డినేటర్‌ విష్ణునాగ్‌ విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా పోటీల్లో ప్రతిభ



దేశెట్టిని సన్మానిస్తున్న నిర్వాహకులు

నందికొట్కూరు: పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లులో ఆదివారం లయన్స్‌ క్లబ్‌ హాల్‌లో వపా, బాపు ఆర్ట్‌ అకాడమీ 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రకళా పోటీల్లో సీతాకోక చిలుక చిత్రం పెయింటింగ్‌ వేసిన పట్టణానికి చెందిన దేశెట్టి శ్రీనివాసులు విజేతగా నిలిచారు. ఆయనను పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అవార్డు, ప్రశంసా పత్రం, జ్ఞాపికతో సత్కరించారు.

దుకాణాల నిర్వహణకు వేలం

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామసమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ కొలనుభారతి దేవి ఆలయంలో దుకాణాలను నిర్వహించుకునేందుకు బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ మోహన్‌ తెలిపారు. ఈనెల 12న నిర్వహించిన వేలం పాటలో కొన్ని అంగళ్ల నిర్వహణకు పాటదారుల ముందుకు రాకపోవడంతో నిలిపివేశామని తెలిపారు. హోటల్‌, బెల్లం చెరుకులు, కొబ్బరి కాయల, అమ్మవారి ఫొటోలు విక్రయించుకునేందుకు ఈనెల 24న బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు వేలంపాటలో పాల్గొన వచ్చునని తెలిపారు.



నాడు అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితిలో సిద్ధేశ్వరం రోడ్డు



నేడు సిమెంటు రోడ్డు, డ్రైనేజీతో రూపుదిద్దుకున్న రహదారి

ఏళ్లనాటి సమస్య పరిష్కారం

- గతంలో అంతర్గత రహదారులు లేక పారుమంచాల వాసుల అవస్థలు
- జగనన్న పాలనలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



నాడు వడ్డెస్వాములు ఇంటి వద్ద రోడ్డు దుస్థితి



నేడు కాలికి మట్టి అంటకుండా నిర్మించిన సిమెంటు రోడ్డు, డ్రైనేజీ



జూపాడుబంగ్లా: చంద్రబాబు పాలనలో పారుమంచాల గ్రామంలో అంతర్గత రోడ్లు గుంతలమయమై ఏళ్లతరబడి నిర్మాణానికి నోచుకోక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. సీఎం వైఎస్‌ జగనన్న పాలనలో రహదారులు మెరుగులు దిద్దారు. రూ.45లక్షల నిధులతో కాలనీల్లో సీసీ రోడ్లు వేయడంతోపాటు డ్రైనేజీలు నిర్మించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మారిన రోడ్డు రూపురేఖలు

పారుమంచాల గ్రామంలోని మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి ఇంటి నుంచి సిద్దేశ్వరం వైపు వెళ్లాలంటే మోకాల్లోతు గుంతలు రోడ్డుపై వాహనాలు అటుంచి నడవాలంటే కూడా ప్రజలు నరకయాతనపడేవారు. అలాగే ఎస్సీ కాలనీల్లో సిమెంటు రోడ్లులేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.30లక్షల నంద్యాల ఎంపీ నిధులు, రూ.15లక్షల జెడ్పీ నిధులు వెచ్చించి సిద్దేశ్వరం రోడ్డు రూపురేఖలు మార్చడంతో ఆ కాలనీ ప్రజలకు అవస్థలు తప్పాయి. మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి ఇంటి నుంచి సిద్దేశ్వరం రోడ్డు వరకు రూ.140మీటర్ల మేర సిమెంటు రోడ్డుతో పాటు డ్రైనేజీలు నిర్మించారు.

బురదకష్టాల నుంచి విముక్తి

గ్రామంలోని వడ్డెస్వాములు ఇంటి నుంచి లింగోజీ ఇంటి వరకు 110 మీటర్ల మేర సిమెంటు రోడ్డు, డ్రైనేజీ నిర్మించి ఆయాకాలనీ వాసులకు బురదకష్టాల నుంచి విముక్తి కల్పించారు. రూ.10లక్షల జెడ్పీ నిధులు వెచ్చించి బ్యాంకు సందు వీధిలో సిమెంటు రోడ్డు, రూ.5లక్షలు వెచ్చించి తాగునీటిబోరు ఏర్పాటు చేశారు. దీంతో ఆ కాలనీ ప్రజల కష్టాలు తీరాయి.

పదేళ్ల తర్వాత రోడ్డు వేశారు



మోకాళ్లలోతు గుంతలమయంగా మారిన సిద్దేశ్వరం రోడ్డును ఎవ్వరూ పట్టించుకొన్న పాపానపోలేదు. రెండు మాసాల క్రితం సిద్దేశ్వరం రోడ్డుపై గుంతలను పూడ్చేసి సిమెంటు రోడ్డుగా మార్చి డ్రైనేజీ కాల్వలు నిర్మించారు. ఇప్పుడు ఆ రోడ్డువెంట కాలికి మట్టి అంటకుండా నడవగలుగుతున్నాం.

– ఈదుల ఈశ్వరరెడ్డి, పారుమంచాల

రూ.45 లక్షలతో అభివృద్ధి పనులు



పారుమంచాల గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని సిద్దేశ్వరం రోడ్డు, లింగోజీ ఇంటి వద్ద నుంచి మాజీ ఎంపీపీ ఇంటి వరకు రోడ్డు, బ్యాంకు సందు రోడ్డులను రూ.30లక్షల ఎంపీ నిధులు రూ.15లక్షల జెడ్పీ నిధులు వెచ్చించి నిర్మించాం. మరో ఐదు లక్షలు వెచ్చించి ఎస్సీ కాలనీలో తాగునీటి బోరుతవ్వించి నీటి సమస్య పరిష్కరించాం. దీర్ఘకాలికంగా ఉన్న రోడ్ల సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షిస్తున్నారు.

– పోచా జగదీశ్వరరెడ్డి, జెడ్పీటీసీ, పారుమంచాల

ఆలయాల్లో సండే సందడి

మహానంది: సెలవురోజు అవడంతో మహానంది, ఓంకారం పుణ్యక్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి, శ్రీ ఉమా సమేత ఓంకార సిద్దేశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఓంకారంలో భక్తులు కొండపైకి చేరుకుని ఉప ఆలయాలను దర్శించారు.

ఓంకారంలో అడిషనల్‌ ఎస్పీ పూజలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం ఓంకార క్షేత్రంలో నంద్యాల జిల్లా అడిషనల్‌ ఎస్పీ వెంకటరాముడు, కుటుంబ సభ్యులు ఆదివారం పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌ బోర్డు చైర్మన్‌ అన్నెం విశ్వనాథరెడ్డి, బండిఆత్మకూరు ఎస్‌ఐ మల్లికార్జున వారికి స్వాగతం పలికారు. వారు గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

కులగణనపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



గాజులపల్లెలో సర్వే చేస్తున్న వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ మల్లికార్జున

మహానంది: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జరుపుతున్న కులగణన సర్వేపై జిల్లా కలెక్టర్‌ ప్రతిరోజు సాయంత్రం సమీక్ష నిర్వహిస్తున్నారని, సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో శివనాగజ్యోతి అన్నారు. ఆమె మాట్లాడుతూ సూచనల ప్రకారం సర్వే చేపట్టాలన్నారు. గాజులపల్లెలో వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ మల్లికార్జున ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వరకు సర్వే కొనసాగింది.

మాజీ ఎంపీటీసీకి బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పరామర్శ



చౌడయ్యను పరామర్శిస్తున్న శాప్‌ చైర్మన్‌ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

పాములపాడు: మాజీ ఎంపీటీసీ చౌడయ్యను ఆదివారం రాష్ట్ర శాప్‌ చైర్మన్‌ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పరామర్శించారు. ఈ నెల 19న చౌడయ్య చిన్న కుమారుడు నాగరాజు గుండెనొప్పితో హఠాన్మరణం చెందిన విషయం తెలుసుకున్న బైరెడ్డి పాములపాడు చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందరికి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచులు చింతల నారాయణ, వరప్రసాద్‌, జేసీఎస్‌ కన్వీనర్‌ నాగరాజు ఉన్నారు.

సంక్షేమ పథకాలతోనే ప్రజల ఆర్థికాభివృద్ధి



హెల్త్‌కార్డును అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: సంక్షేమ పథకాలతోనే ప్రజల ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ మోహన్‌కుమార్‌, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముష్టపల్లి గ్రామంలో ఆదివారం వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అందజేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు ఉచిత గ్యాస్‌ సిలిండర్లు, ఆయుష్మాన్‌ హెల్త్‌ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయక్‌, డాక్టర్‌ పవన్‌కుమార్‌, అధికారులు పాల్గొన్నారు.

నేడు వెలుగోడులో ర్యాలీ



అన్నదాన కార్యక్రమానికి బియ్యం, నగదు అందజేస్తున్న ఎంపీపీ లాలం రమేష్‌

వెలుగోడు: అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ శుభ సందర్భంగా పట్టణంలో సోమవారం భారీ ప్రదర్శన చేపట్టినట్లు నిర్వాహకులు ఏ.కృష్ణార్జునరెడ్డి, పార్థసారధిరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం నుంచి శ్రీలక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం (గండిపేట) వరకు ర్యాలీ, బైక్‌ ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి హిందువు ఊరేగింపులో పాల్గొనాలని కోరారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అన్నదాన కార్యక్రమానికి ఎంపీపీ లాలం రమేష్‌ రూ.50 వేలు, బియ్యం అందజేశారు. అలాగే అక్షయ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పట్టణంలో పలు వీధుల్లో అయోధ్యలోని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీలుగా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ వేల్పుల జయపాల్‌, బాల రాముని భక్త బృందం లక్ష్మీ నారాయణ, ఆకుల సాయన్న, తలం సురేష్‌, జీవీ రమణ గౌడు, నాగేశ్వరరావు, శేషాద్రి, ఆంజనేయులు, కేదార్నాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో నేడు సీతారాముల కల్యాణోత్సవం



మహానందిలో కొలువైన శ్రీ సీతారాములు

మహానంది: అయోధ్యలోని రామ జన్మభూమిలో సోమవారం జరగనున్న శ్రీరాముల వారి ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని లోక సౌభాగ్యం కోసం మహానందిలో కొలువైన శ్రీ సీతారాముల వారికి కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి ఆదివారం వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ మహానంది గ్రామ ప్రజలు, భక్తుల సహకారంతో ముందుగా నగర సంకీర్తనలు, శ్రీరామభజనలు ఉంటాయన్నారు. అనంతరం అయోధ్య జరిగే రామవిగ్రహ ప్రతిష్ఠ ముహూర్తంలో మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరాముడి అనుగ్రహం పొందాలని విజ్ఞప్తి చేశారు.

క్షేత్ర పవిత్రతను కాపాడేందుకు కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ ప్రసాద్‌రావు

శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రం పవిత్రతను కాపాడేందుకు కృషి చేస్తానని సీఐ ప్రసాద్‌రావు అన్నారు. ఆదివారం ఉదయం నూతన సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్షేత్రంలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు , అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూస్తామన్నారు. తాను 2009 బ్యాచ్‌ లో పోలీస్‌ డిపార్ట్‌మెంట్‌లో చేరానని, చిత్తూరు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేసి బదిలీపై శ్రీశైలానికి వచ్చినట్లు తెలిపారు. కాగా రానున్న శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఈఓ, చైర్మన్లతో పాటు పోలీస్‌ సిబ్బందితో కలిసి క్షేత్రపర్యటన చేస్తానన్నారు. భక్తుల భద్రత పై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. అనంతరం ఆయన శ్రీశైలం విచ్చేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని దేవస్థానం అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీశైలంలో సుమారు 18నెలలుగా సీఐగా విధులు నిర్వహిస్తున్న దివాకర్‌రెడ్డిని చిత్తూరు జిల్లాకు బదిలీపై పంపిస్తున్నట్లు సమాచారం.

వాల్మీకి నగర్‌లో వేమన జయంతి



వేమన గురించి ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంతం కమిటీ సభ్యులు

నందికొట్కూరు: నేటి తరం యోగి వేమనను ఆదర్శంగా తీసుకోవాలని త్రైత సిద్ధాంత సేవా సమితి అధ్యక్షుడు రామచంద్రుడు కోరారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి నగర్‌లో యోగి వేమన జయంతిని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేమన పద్యం వెయ్యి అర్థాలు అమరి ఉండవచ్చన్నారు. పద్యం శోధించి చూస్తే అంతా ఆత్మ జ్ఞానమే ఉంటుందని చెప్పారు. కమిటీ సభ్యులు కుమార్‌, శ్రీనివాసులు, సంజీవ, పార్థసారధి, చక్రపాణి, మద్దిలేటి, మనోహర్‌, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సంఘం క్యాలెండర్‌ ఆవిష్కరణ



కాపు క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న టౌన్‌ సీఐ ప్రకాష్‌కుమార్‌

నందికొట్కూరు: పట్టణంలోని పోలీసు టౌన్‌ సర్కిల్‌ కార్యాలయంలో సీఐ ప్రకాష్‌కుమార్‌ చేతుల మీదుగా ఆదివారం కాపు సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను విడుదల చేశారు. కాపు సంక్షేమ సంఘం రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బలిజలందరూ 22 శాతం ఉన్నారన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో బలిజలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్‌ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, రామిరెడ్డి, చంద్రశేఖర్‌, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం

నందికొట్కూరు: కర్నూలు నగరంలోని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి స్వగృహంలో మంగళవారం నందికొట్కూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఉంటుందని మున్సిపల్‌ చైర్మన్‌ దాసి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో శాప్‌ చైర్మన్‌ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్‌ దారా సుధీర్‌ పాల్గొని 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంపై చర్చిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు రూరల్‌ : నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని దామగట్ల పొలిమేరల్లో ఆదివారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. ఎస్‌.ఐ తెలిపిన వివరాల మేరకు మిడుతూరు ఎస్‌ఐ జగన్‌మోహన్‌, క్రైమ్‌ పార్టీ పోలీసుల ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, ద్విచక్ర వాహనాన్ని సీజ్‌ చేసి, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్‌: క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని, క్రీడల్లో ప్రోత్సహించడంలో తమ కుటుంబం ముందుంటుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీశైలం విచ్చేసిన ఎమ్మెల్యే శిల్పాను ఇటీవల కార్తీక్‌ ప్రీమియర్‌ లీగ్‌ టోర్నమెంట్‌లో మొదటి విజేతగా నిలిచిన సున్నిపెంట జట్టు క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డిని శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తుతో పాటు, శారీరక ధృడత్వం కలిగి ఉంటారని అన్నారు. ఎమ్మెల్యేను సన్మానించిన వారిలో మార్కెట్‌ రాకెట్స్‌ (సున్నిపెంట) జట్టు కెప్టెన్‌ వి.కమలాకర్‌, ఎస్‌.ఆనంద్‌బాబు, జి.చిన్న, జె.చిన్నరాజు, అఖిల్‌, రజాక్‌, శివనాయక్‌, నాగేంద్ర, ఎస్‌.రాజు, సంజీవ్‌, ప్రవీణ్‌, తదితరులు ఉన్నారు.

గిరిజనులకు చీరల పంపిణీ

శ్రీశైలంలో నివసిస్తున్న చెంచు గిరిజన మహిళలకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చీరలను పంపిణీ చేశారు. ఆదివారం సాయంత్రం అన్నదాన భవనం పక్కన శ్రీశైలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నాగమల్లయ్య పెళ్లి రోజును పురస్కరించుకుని చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ రాజకీయ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు.



సునీత తండ్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

సునీత కుటుంబానికి పరామర్శ

శ్రీశైలానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లు కుమార్తె సునీత ఇటీవల ప్రమాదవశాత్తు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మానవతా ధృక్పథంతో ఆ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో స్వచ్ఛతీర్థ కార్యక్రమం



స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైలక్షేత్రంలో ఆదివారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. దేవస్థాన ఈఓ పెద్దిరాజు, అధికారులు శిఖరేశ్వర ఆలయం వద్ద స్వయంగా చీపుర్లతో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్‌ ఇంజినీర్లు వి.రామకృష్ణ, జి.మురళీధరరెడ్డి, ఏఈవో బి.మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్‌ ఇంజినీర్లు పి.చంద్రశేఖర్‌శాస్త్రి, పర్యవేక్షకులు అయ్యన్న, పారిశుద్ధ్య విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

పగిడ్యాల: పోలీస్‌ స్టేషన్‌కు కూతవేటు దూరంలో కొత్త ముచ్చుమర్రి సీఎస్‌ఐ చర్చి సమీపాన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన వార్డుమెంబర్‌ రాజు పశుపోషణ నిమిత్తం సమకూర్చుకునన్న పశుగ్రాసానికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. గడ్డివాములకు మంటలు వ్యాపించడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు అదుపుకాకపోవడంతో కర్నూలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు శ్రమించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 3 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

కులగణన సర్వే వేగవంతం చేయాలి



అంజనేయనగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పగిడ్యాల: ఈనెల 28వ తేదీలోగా కుల గణన సర్వేను పూర్తి చేయాల్సి ఉన్నందున ఎన్యుమరేటర్లు సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. ఆదివారం మండలంలోని అంజనేయనగర్‌ గ్రామంలో జరుగుతున్న కుల గణనన సర్వేను పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా ఉండే 11,192 కుటుంబాల కుల గణన చేయాల్సి ఉందన్నారు. ఎన్యుమరేటర్లు యాప్‌లో ప్రతి అంశాన్ని ఏకాగ్రత్తతో నమోదు చేయాలని, నిర్లక్ష్యానికి చోటివ్వరాదని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి తదితర సిబ్బంది ఉన్నారు.